# డప్పు

సామాన్యుని సాదా జీవితములో కష్ట సుఖాల్లా నీరెండ నీడలు వసారాలో కొచ్చిపోతున్నాయి. పాతగోడకు వీపు అప్పగించి కూచున్న జయమ్మ మనసు మైదానములో గతం జ్ఞాపకాలు గంతులేస్తుంటే గుంభనంగా నవ్వుకుంటోంది. యాబైపైగా వసంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన కళ్లల్లో కాంతి రేఖలు తళుక్కుమంటున్నాయి. ఇంటి ముందున్న వేపచెట్టు రెమ్మల్లోంచి చొచ్చుకొచ్చిన్న లేత సూర్య కిరణాలు వెన్నెల వెలుగుల్లాగున్నాయి.

అనాడు కొత్త పెళ్ళి కూతురుగా... రూపుదిద్దుకున్న కోటి కోర్కెల్ని కొంగున ముడేసుకుని ఇంటి గడప దాటినప్పుడు అదే వేప...ఈడేరబోతున్న ఆడపిల్లలా లేత కొమ్మల్ని లాఘవంగా ఆడిస్తూ స్వాగతం పలికింది. ఇప్పుడు దానిగ్గూడా వయసు ముదిరి పొడగాటి, లావైన కొమ్మలు రెమ్మలుగా విస్తరించింది. తన అనుభవాలకు సాక్షిగా, అనుభూతులకు ఆలంబవగా నిలిచి నవ్వులు రువ్వుతోంది.

పండగ పబ్బాల సమయాలలో తన భర్త నాగరాజు హడావుడి అంతా ఇంతా కాదు. డప్పు శిష్యగణంతో, కోలాహలంలో హుషారుగా పాల్గొనేవాడు. వాళ్ళంతా చంకల్లో డప్పు లిరికించుకుని, పుల్లలతో వాయిస్తూ గజ్జెల కాళ్ళతో గుండ్రని వరుసలో లయబద్ధంగా గంతులేస్తుండేవారు. అందరి మధ్య నాగరాజు పడగెత్తిన నాగరాజులా అటూ ఇల్లటూ తిరుగుతూ శిష్యులకు సైగలు చేస్తూతానూ వాయించే వాడు. అదొక అద్భుత దృశ్యం.

శివరాత్రి ఉత్సవాల్లో పరమశివుని ఉత్సవ విగ్రహం ఊరేగింపులో నాగరాజు డప్పుల బృందం ముందుండేది. భక్తి ప్రపత్తులతో తన్మయంగా డప్పుల కోలాటాన్ని ప్రదర్శిస్తూ ఎన్నెన్నో పాటలు పాడేవారు. ఒకరు పాడుతుంటే మిగతావారు గొంతులు కలుపుతుంటే వినసొంపుగా, కనువిందుగా ఉండేది.......

"తాలేలిల్లియ్యలో శివ తాలేలిల్లియ్యలో
కులమేలాగున్నది, వినుమయ్యలో
మూలము గోచర్మ, మైదుకీళ్లుగల
తోలుబొమ్మలాట ఈ జగము
అంతా తాలేలిల్లియ్యలో కులమేలా
ఐదైదుల ఇరవయ్యేదు తత్వముల
మనుషులు పుట్టిరి,
కులమేలాగున్నది?
దేవదాసియగు వూర్వసి గర్భము
నుద్భవించిన వసిస్టకులమూ
కులమేలాగున్నది.......... ॥తాలే॥

కథా నిలయం
శ్రీకాకుళం

మైమరచి పాడుతూ ఆడుతూంటే కైలాసము నుండి ప్రమథగణము దిగివచ్చి శివతాండవ మాడుతున్నట్టనవించేది. నాగరాజు డప్పు వాయిస్తూ మైమరచి గంతులేస్తుంటే డమరుకం వాయిస్తూ శివతాండవం చేస్తున్న నటరాజులా కన్పించేవాడు.

డప్పు వాయించడములో అతనికెంతో నైపుణ్యముండేది. అదంతా తండ్రి నుండి సంక్రమించిన మూల విద్యకు మెరుగులు దిద్దుకున్నదే. తనకొచ్చిన కళానైపుణ్యాన్ని శిష్యులకు నేర్పించి తానూ వారిలో ఒకడైపోయేవాడు.

పెళ్లి ఊరేగింపులో డప్పుల బృందమే ప్రత్యేక ఆకర్షణ. ఎన్ని డప్పులెక్కు వగా ఉంటే అంత గొప్ప. నాగరాజు బృందం డప్పు విన్యాసాలను అపురూపమైన నాట్య విలాసంగా చూసేవారు. నేలమీద డప్పు బోర్లించి, దానిపైన చిల్లర డబ్బులుంచేవారు. నాగరాజు మోకాళ్లమీద ఒడుపుగా నేలకు వంగి, బోర్లించిన డప్పుకు దగ్గరగా తన డప్పును విలాసవంతంగా వాయిస్తుంటే, ఆ శబ్ద ప్రకంపనాలకు చిల్లెర డబ్బులు కదిలి నేలమీద పడిపోయేవి. నేలపై వేసిన కరెన్సీ నోట్లను డప్పు వాయిస్తూ కనురెప్పతో అందుకునే వాడు. అందనిరినీ ఆనందపరిచే ఆ విన్యాసాలను చూసేందుకు ఊరి జనాలంతా మూగేవారు. ఆ విద్య నాగరాజు ద్వారా అతని శిష్యులగ్గూడా సంక్రమించింది.

ఆ రోజుల్లో మాదిగ నాగరాజంటే మహాదేవుడనే వారు. వేపచెట్టు నీడనే కళామతల్లి ఒడిగా భావించి డప్పు వాయిద్యములో కొత్త ప్రయోగాలు అభ్యాసం చేస్తుండేవాడు. ఆ అభ్యాసాలను ఇరుగు పొరుగు వారు చెవులప్పగించి వినేవారు.

"శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరర్సం ఫణి...." సామెతను సాకారం చేస్తూ ఇంట్లోనే పుట్టి పెరుగుతున్న బర్రె గూడా చెవులూపుతూ వినేది. నిగనిగలాడే దేహఛాయ, గుండ్రని కొమ్ములు, తమలపాకుల్లాంటి చెవులు, చారెడేసి కళ్ళతో వేప చెట్టుకింది ఓమూల పాకలున్న బర్రెను ఇంటి వాళ్లెవ్వరూ మామూలు పశువుగా భావించేవారు కాదు. కుటుంబ సభ్యుల్లో అదొకటి. ప్రత్యేకంగా తయారు చేసిన కుడితి తాగి పెద్ద తపేలా నిండా పాల్చిసేది. ఇరుగు పొరుగు వారందరికీ ఆ పాలరుచి తెలిసేది. ఆ రోజుల్లో పాలు పెరుగు అమ్మడాన్ని పాపంగా భావించేవారు.

ఎందరో దేవుళ్ళకు ఎక్కడెక్కడో మొక్కులు చెల్లించుకున్న తర్వాత జయమ్మ కడుపు పండింది.

కొడుకు రాజేశంను బాగా చదివించి, డప్పు వాయిద్య కళలో తనంతటి వాడిని చెయ్యాలని నాగరాజు ఆశయం. ఆశయాలన్నీ అక్షరాలా ఆచరణ సాధ్యమైతే మనిషి ఎప్పుడో దేవుణ్ణి మించిపోయేవాడు గదా!

బలకృష్ణుడిలా రాజేశం బుల్లి బుల్లి నడకతో బర్రె దగ్గరికెళ్ళి సయ్యాటలాడుతూ కేరింతలు కొట్టేవాడు. రోజూ ఒక్కసారైనా బర్రెను చూడందే బడికెళ్లేవాడు కాదు.

కాలం కౌగిట్లో కనీవిని ఎరుగని కల్లోలం చెలరేగుతుందని ఎవ్వరూ అనుకోలేదు. సశ్యశ్యామలంగా ఉన్న గ్రామం కొద్ది సంవత్సరాల్లోనే మరు భూమిగా మారుతుందని ఎవ్వరూ జోస్యం చెప్పలేదు. రాను రాను వర్షాకాలం నామమాత్రమైంది. ఎండకాలం మాత్రం కుందేలు మాంసానికి మరిగిన తోడేలూలా ఎగిరెగిరిపడుతూ తన ప్రతాపాన్ని

చూపిస్తోంది. భూగర్భ జలాలు అడుగంటినాయట, పచ్చని పొలాలు ఎడారి భూములై పోయినై. తడిలేక వానలకోసం ఎదురు చూస్తూ చెరువులు, బావులు నోళ్ళు తెరిచి కూచ్చున్నై. అందరి ఆశల్ని అడియాశలు చేస్తూ కరువు కాటకాలు గజ్జెకట్టి నాట్యం చేస్తున్నై.

మనుషుల తిండి దేవుడెరుగ్గాని, పశువులుగ్గూడా నీరు, గడ్డి కరువైంది. గడ్డిపోచకు మొహాలు వాచిపోయినై.... అంబా అంబా... దీనమైన అరుపులు మనసున్న మనుషుల్ని కదిలించేస్తున్నై. డబ్బులున్న మారాజులకే లోతుబోరు నీళ్ళు అందుబాటులో కొచ్చినై. పట్నం వ్యాపారస్తులు ట్యాంకర్లతో నీళ్ళు తెచ్చి పల్లెటూళ్ళలో అమ్ముతున్నారు. అది చూడలేక వయసు మళ్లిన వారి బుర్రల్లో భూకంపాలొస్తున్నై.

సినిమా హోరు, టి.వి. ఛానళ్ల జోరు, నాగరికత, తరిగిన మనిషి విలువలు... డప్పు వాయిద్యాన్నెరూ పిలవట్లేదు. రెక్కల కష్టం చేసి బతుకీడుద్దామంటే కూలినాలి గూడా దొరకడం లేదు.

నీటి చుక్క! గడ్డిపోచ కోసం బర్రెను చూస్తూ దూడ, దూడను చూస్తూ బర్రె పట్టపగలే అరుస్తుంటే వాటినోళ్లలోకి ఎండ దూరింది కాని ఎండుగడ్డి పోచకూడా దొరకలేదు. ఎలాగైనా సరే కళ్లముందు పెరిగిన పశువుల్ని కాపాడుకోవాలనే పట్టుదల పెరిగింది. నాగరాజు పక్కూరి నుండి కొనుక్కొచ్చిన గడ్డిమోపు వారానికి గూడా సరిపోలేదు. పశువుల్ని రుద్రారం అల్‌కబీర్ పశువధశాలకి తరలించే దళారీల బెడద మరోవైపు. ఓ దళారి అడిగాడు. "నాగన్నా! మనుషులకే తిండికి, నీటికి దిక్కులేదు, ఇంక పశువులకెట్లా? బర్రె, దూడను అమ్మనంటివి. ఓసారి ఆలోచించు పశువుల్ని అమ్మి మనుషుల ప్రాణాలు కాపాడుకో!" అనగానే దళారి మొహమ్మీద ఉమ్మేయాలనిపంచింది జయమ్మకు కోపాన్నాపు కోలేక ఒంటికాలు మీద లేచింది.

"చాల్చాలేవయ్యా! ఇంట్లో పుట్టి పెరిగిన నోరులేని పశువుల్ని అల్‌కబీరుకమ్మ మంటావా? ఆ ఫ్యాక్టరీ కత్తులు వాటి తలలు నరుకుతుంటే ఎంత దీనంగా అరుస్తాయో తెలుసా? మీరసలు మనుషులా లేక రక్తం మరిగిన రాక్షసులా?" అని జయమ్మ ఎడాపెడా దులిపింది.

ఎంత ఎదురు చూసినా ఎందరు దేవతలకు మొక్కినా వానచినుకు జాడలేదు. నాగరాజు దంపతలు ఆశలు సుడిగాలిలో మురమురాలైపోయినై. నీళ్ళులేక, గడ్డిలేక బర్రె, దూడ అంబా అంటూ ప్రాణాలొదిలినై. కన్నతల్లి, కడుపున పుట్టిన కూతురు ఒకేసారి చనిపోయినట్టు గుండెలు బాదుకుంటూ గోడగోడుమన్నారు.

కష్టాలు–కడగండ్లనెదిరిస్తూ చిన్నప్పట్నుంచే కొడుకును చదివించటం నయమైంది. స్వయంగా నాగరాజే సరస్వతి నమస్తుభ్యం... మంత్రాన్ని కొడుకుతో పలికిస్తూ అక్షరాభ్యాసం చేయించాడు.

ప్రాణ సమానంగా పెంచిన పశువులమీది మమకారం దూడ చర్మాన్ని నాగరాజు డప్పుకు ఆచ్ఛాదనగా వేయించింది. దాన్ని నాజూగ్గా వాయిస్తుంటే.... దుర్గ దూడ

ఎదురుగా కూచుండి తలుపూతున్నట్టనిపించేది. కరువు కాటకాలు మనో వ్యాధిగా మారి నాగరాజును పొట్టన బెట్టుకున్నాయి. కష్టాలను, కన్నీళ్ళను మరిపించేది కాలమే కాబట్టి జయమ్మ నిలదొక్కుకుంది.

రిజర్వేషన్ కోటా రాజేశంకు టీచరుద్యోగ మిప్పించింది. జీవితానికో ఆసరా దొరగ్గానే చదువుకున్న శిరీష జీవిత భాగస్వామిగా వచ్చింది. ఫ్యాషన్ టెక్నాలజీ తెలుసుకుంది. కాబట్టి సినీ హీరోయిన్‌లా దర్జాగా, స్వతంత్రంగా బతకాలనే, అహాన్ని కొంగున ముడేసుకుని కోడలైంది. సంవత్సరంలోగా తల్లి అయింది. మనవణ్ని ఆడిస్తూ జయమ్మ మనసు నింపుకుంటోంది.

భర్తకు ప్రాణ సమానమైన డప్పు గోడకు వేళ్లాడుతోంది. అందులో నాగరాజు రూపం లీలామాత్రంగా కనబడ్తోంది.

"జయా! నువ్వదృష్టవంతురాలివి మన కొడుక్కు నౌకరి దొరికింది గదా!" అని ఊరడిస్తుంది. కోడలు అహం తనపాలిట శాపంగా మారిందని చెప్పలేక చేతులెత్తి నమస్కరించి "నన్ను నీ దగ్గరికి తీస్కో" మ్మని బతిమాలుతుంది.

"ఓర్నియవ్వ! చావు పుటుకలు మన చేతుల్లో ఉన్నాయా? రోజూ ఈ డప్పుకున్న దుర్గ తోలు మీద నన్ను చూస్తున్నావ్ గదా! దీంట్ల నా ఆత్మ ఉందిసుమా!" అంటాడు. వెన్నెల వెలుగులాంటి నవ్వుతో మాయమైపోతాడు.

పాత అనుభవాల అనుభూతులతో కాలాన్ని నెట్టుకొస్తున్న జయమ్మకు వారం క్రింతం జరిగిన సంఘటన ఓ కుదుపు కుదిపేసి ఎటూ కాకుండా చేసింది.

రోజట్లాగే ఆ రోజుగూడా ఉదయ సూర్య కిరణాలలో తడుస్తూ గుడికెళ్లి వచ్చింది. మనసు ప్రశాంతంగా ఉంది. రెండేళ్ల నిండని మనవని కేరింతలు బయటికి వినబడుతున్నాయి. "హబ్బా ఎంత ఖుషీగా ఉన్నాడో బుజ్జిగాడు!" ఆసక్తిగా మనవని దగ్గరికెళ్లింది. పసివాని ముందు డప్పు... అదే డప్పు.. చర్మం పగిలిపోయింది... నాగరాజు ఆత్మస్వరూపం... అయ్యో! దానిమీద బుల్లి చేతులు తపతపలు... ముజ్జగాలు గెలిచిన మారాజులా... వాయిస్తున్నాడు. జయమ్మ గుండెపొరల్లో కప్పతేళ్ళు కాటేస్తున్నట్టు.... బాధ.... ఆవేదన... అంతరాళాల్లోంచి సునామీ అలల్లా పొందుకొస్తున్నె అప్పటికప్పుడే.... ఒడిసెల దెబ్బతిన్న పిచ్చుక పిల్లైపోయింది.

"అయ్యల్లా! వీడికీ డప్పెవలిచ్చింరురా రాజేశం" గుండెలు బాదుకుంది. డప్పును ఎత్తి గుండెలకు హత్తకుంది. ఆ అరుపుకు ఇల్లు దద్దరిల్లింది. "ఏమైందంటా?" శిరీష కొంగునడుముకు బిగిస్తూ బయటికొచ్చింది... ముండమోసిన పాత డప్పుల ఏముందటా?" మొహమ్మీది ముంగురుల్ని కసిగా సవరించుకుంటుంటే ముక్కుపుటాలెగిరి పడుతున్నై...

"గిదే పాత డప్పులో నా ప్రాణాలున్నాయమ్మా...!" తోసుకొస్తున్న దుఃఖం కంటిధారలైంది.

"గీ మాటలు ఎవలన్నా వింటే నవ్విపోతరత్తా!" శిరీష ముక్కుమీద వేలేసుకుంది. పోరడు ఏడుస్తుంటే ఆడుకొమ్మని నేనేఇచ్చిన.. నీ కొడుకు కూరగాయలకు పోయిండు.. గాయింతదానికే గింత గాయిపెట్టాల్నా?"

"ఇది మామూలు డప్పు కాదమ్మా....."

"ఆహఁ! దాని చుట్టూ వెండిగజ్జలున్నాయా? తోలు.... బంగారం తోలా?" పళ్లు బిగపట్టింది. కనుబొమ్మలు గచ్చకాయల్లా ఎగిరి పడుతున్నై.

"అంతకంటే ఎక్కువనే బిడ్డా!" నరాల్లోని రక్తం సలసలకాగి పోతోంది. కోడల్ని మందలించలేక మనవణ్ణి నిందించలేక... పోలీస్ స్టేషన్లో నోట్ల గుడ్డలు కుక్కి లాఠీలతో ఒళ్లంత కుళ్లబొడిచిన అవస్థ ననుభవిస్తోంది. ఆవేదనంతా గొంతులో బిగపట్టింది.

తీగలు తెగిన హృదయ వీణ "అయ్యా నాగరాజా! మనింట్ల పుట్టి పెరిగిన దూడ తోలుతోని డప్పు చేయిస్తివి. దుర్గ దూడను దాంట్లో చూసుకుంటివి.... నిన్నునేను ఇదే డప్పుల చూసుకుంటి... ఇప్పుడెక్కడ చూసుకోవాలెనయ్యా...." పరిపరి విధాల పరితపిస్తోంది. గుండెల్లోని నొప్పి క్షణక్షణం బలపడుతోంది. డప్పు పక్కన పడేసి నేలమీద ఒరిగి పోయింది.

"అహోహో!! ఇదో మయాబజార్ బాగోతమా?" చేతులు, మూతి వంకరగా తిప్పుతూ శిరీష కాడుకును చంకనేసుకుని ఎవరో తరుముతున్నట్లు లోపలికెళ్లి పోయింది.

అవును! నా బతుకే బాగోతమై పోయింది నా బర్రె, దూడ గోస.... ఉసురు ఈ ఇంటికి లిగిందేమో! బర్రె, దూడపాయె... నా మొగుడు పాయె. ఆ మారాజు రూపాన్ని రోజూ చూసుకుంటున్న డప్పు వక్కలైపాయె.... ఇంగ ఈలోకముల నాకేముంది? ఇటు మానసికాందోళన... అటు గుండె పొరల్లో సూదులు పొడుస్తున్న నొప్పి... రాజేశం వస్తున్నాడు.

"అయ్యా... రాజేశా..." నెత్తికొట్టుకుంది.

"ఏందమ్మా!" రాజేశం అరే! గాడప్పెట్లా పలిగిపోయింది? అది ఇక్కడెందుకుందీ?" కూరగాయల సంచి పక్కన బెట్టి, తల్లిని ఒడిలోకి తీసుకున్నాడు. జయమ్మ తల్లడిల్లుతోంది. కొడుకు మొహంలోకి చూస్తూ అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది. కళ్లు ఊటచెలిమ లైపోయినై.

"..... అగో మీ నాయన... ఆకాశంలున్నాడు" చేతులెత్తి నమస్కరించి "డప్పు ఇయ్యిమంటున్నాడురా!"

"అమ్మా... అవేం పిచ్చిమాటలే!" రాజేశం హడల్ 'ఏమైందమ్మా.... నీకేమైందే?" భయం ఆందోళనలతో తల్లి తలను మరింత పైకి లాక్కుని అరచేతుల్లో రాస్తున్నాడు.

"మీయమ్మకేమీ కాలేదు గానీ...." కొడుకు నెత్తుకుని గడగడా బయటికొచ్చింది శిరీష. జయమ్మ వాలకం అనుమానంగా కన్పించింది. గుండెల్లో గుండ్రాయి దొర్లింది.

"అసలేమైంది శిరీషా.?" ఆవేశంలో ఆవేదన.

"ఏమీ కాలేదు....' గాలిదీసిన ట్యూబులా కన్పిస్తున్న జయమ్మ నాపాదమస్తకం చూస్తూ గతుక్కుమంది. ఇప్పుడధైర్యపడితే అనర్థం జరగొచ్చు.. తమాయించుకుంది.

"ఏముందయ్యా, మీయమ్మ ఎప్పట్లెక్క గుడికి పొయ్యొచ్చింది... రాంగానే గా పాతదప్పును తీసుకుని దబదబా వాయించుకుంటూ గంతులేసింది. గట్లెందుకని అడిగితే... నా ఇష్టం పో... అన్నది... నేను వంటింట్లోకి పోయిన గంతే....." అని చారెడేసి కళ్లను చేపల్లా తిప్పుతూ అమాయకత్వాన్నంతా మొహమ్మీద పులుముకుంది.... "అయ్యో... దప్పు తోలు పగిలిపోయిందా? అని నోరెల్లబెట్టింది."

చంకలున్న పసివాడు తల్లిమొహాన్ని... తండ్రి మొహాన్ని మార్చి మార్చి చూస్తున్నాడు .... వాకిట్లో గాలిమామతో పరాచకాలాడుతున్న వేపరెమ్మలు సాక్ష్యం చెప్పలేక తమ నిస్సహాయతకు నిందించుకుంటున్నాయి. కానీ... నిజాన్ని గాలిచెంత చెవిలో ఊదేసినై.... గాలి బావ స్థంభించి పోయాడు.

జయమ్మకంతా వినబడుతోంది... కనబడుతోంది.... నోరు మెదపక పోవడమే మంచిదన్పించింది.... అత్తల అధికారం కొన్ని రోజులైతే కోడళ్ల పంతం కొన్ని రోజులు.... అన్నారు గదా!

ఇంత జరిగినా, కోడలి కిష్టం లేకపోయినా, కొడుకు తనను ఆసుపత్రికెందుకు తీసుకెళ్లినట్టు.....? పరువు కోసమా, ప్రతిష్ఠ కోసమా....? పెళ్లానికి చెడ్డపేరు రావద్దనా ....? లేక కన్నతల్లి పట్ల కర్తవ్యమా...?

ఏది ఏమైనా... తాను గోలుకుంది... దప్పు మాయమైంది. కలియుగంలో ధర్మం ఒంటికాలుతో నన్నా నడుస్తుంది... కానీ... కానీ మరి దప్పు సంగతో!?

**భాగవతరంగిణి మార్చి 2006-కథలపోటీల్లో బహుమతులు**

❖ ❖ ❖ ❖

